ఈనాడు
సిద్దిపేట
గురువారం అక్టోబరు 24, 2024

సంఘ విద్రోహ శక్తులపై నిఘా: డీజీపీ


పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న డీజీపీ జితేందర్, ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ అనూరాధ

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: శాంతిభద్రతలకు పెద్దపీట వేస్తూ, సంఘ విద్రోహ శక్తులపై నిఘా సారించాలని రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ సూచించారు. ముఖ్యంగా ప్రొయాక్టివ్ పోలీసింగ్‌పై దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డయల్ 100 కాల్స్ విషయంలో బ్లూకోల్ట్స్ సిబ్బంది త్వరితగతిన స్పందించి నేరాలను నియంత్రించాలన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లను బుధవారం ఆయన మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. మూడేళ్లలో నమోదైన కేసుల వివరాలు, జిల్లాలోని ఇతర సరిహద్దు పోలీస్‌స్టేషన్, సబ్‌డివిజన్‌లోని అధికారులు, సిబ్బంది వివరాలు, సీసీ కెమెరాలు, వీపీవో వ్యవస్థ, పిల్లలు, మహిళల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, యాంటీ డ్రగ్ కమిటీలు తదితర అంశాలపై సీపీ అనూరాధ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పనిచేయని సీసీ కెమెరాలకు మరమ్మతు చేయించాలని డీజీపీ సూచించారు. రోడ్డు ప్రమాదాల విషయంలో బ్లాక్‌స్పాట్ల వద్ద తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మూఢనమ్మకాలపై కళా బృందాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి విక్రయాలను నియంత్రించాలన్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిటీ పోలీసింగ్‌తో ప్రజలకు చేరువకావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ మల్లారెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, సుమన్‌కుమార్, యాదగిరి, రవీందర్, శ్రీనివాస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, శ్రీధర్, శ్రీధర్‌గౌడ్, ఏవో యాదమ్మ, సూపరింటెండెంట్లు ఫయాజుద్దీన్, అబ్దుల్‌ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట టౌన్: మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని డీజీపీ సూచించారు. కోర్టు విధులు నిర్వహించే పోలీసులతో ప్రతి శనివారం సమావేశం నిర్వహించాలన్నారు. కమిషనరేట్ కార్యాలయ సిబ్బంది పనితీరు బాగుందని కితాబిచ్చారు. అంతకుముందు సీపీ అనూరాధ, జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానమే లక్ష్యం


బస్సు డిపో మేనేజర్‌తో ఫోన్లో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్ రావు

నంగునూరు, న్యూస్‌టుడే: పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం మూడోస్థానంలో ఉందని.. దాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. బుధవారం నంగునూరులో ఇంటింటికీ తిరుగుతూ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆటోలోని ప్రయాణికులను పలకరించగా.. నంగునూరుకు బస్ సర్వీసులు తక్కువగా ఉన్నాయని వారు చెప్పారు. వెంటనే సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌తో ఫోన్లో మాట్లాడి ఎక్కువ సర్వీసులు కల్పించాలని సూచించారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టలేదని రైతులు తెలపడంతో డీఆర్డీవో పీడీతో ఫోన్లో మాట్లాడి.. వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్నకోడూరు, నంగునూరు మండలాల మధ్య రహదారి నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా అధ్యక్షులు గంగాడి మోహన్ రెడ్డి, వెంకటరామ్ రెడ్డి పాల్గొన్నారు.

తొగుట: మండలం లింగాపూర్‌లో నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో ఎంపీ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

సిద్దిపేట: చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో స్థానిక వివేకానందనగర్, నర్సాపూర్ ఎక్స్ రోడ్డు, శంకర్‌నగర్, వాసవీనగర్, నర్సాపూర్ గ్రామం, రెండు పడక గదుల ఇళ్ల కాలనీ, గుండ్ల చెరువు ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిచిపోనుంది. వినియోగదారులు సహకరించాలని విద్యుత్తు శాఖ ఏడీఈ సుధాకర్‌రెడ్డి కోరారు.

సీతారాముల ఆలయంలో చోరీ

కోహెడ: చంచల్ చెరువుపల్లిలో బుధవారం తెల్లవారుజామున సీతారామాలయంలో బంగారు పుస్తెలు చోరీ అయ్యాయి. గ్రామానికి చెందిన బాపురెడ్డి. . గుడికి వెళ్లి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలి వెళ్లి చూడగా, సీతమ్మ వారి పుస్తెలు చోరీకి గురయ్యాయి. ఆలయ అధ్యక్షుడు మహేందర్, బాపిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు.

ఉత్తమ విద్యతో ఉన్నతి

● ఐఎస్‌వో సాధించిన సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

న్యూస్‌టుడే, సిద్దిపేట: సొంత భవనం.. విశాల మైదానం.. సకల సదుపాయాలు.. అనుభవజ్ఞులైన బోధకులు.. వెరసి సిద్దిపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రత్యేకతను చాటుతోంది. చదువు, పోటీ పరీక్షలు, ఇతరత్రా అంశాల్లో మెరుగైన ఫలితాలతో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ కళాశాల ఐఎస్‌వో(ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్) గుర్తింపును సాధించింది. అనేక ప్రమాణాల ఆధారంగా ఈ ధ్రువపత్రం దక్కనుండగా.. వివిధ అంశాల్లో మొత్తం మూడింటిని(ఐఎస్‌వోలను) ఖాతాలో వేసుకుంది. ఈ నేపథ్యంలో కళాశాల ప్రత్యేకతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..


స్వచ్ఛ భారత్ చేపడుతున్న విద్యార్థులు

తనదైన ముద్రవేస్తూ..

చదువులో మెరుగైన ఫలితాలు, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాలు, ఆటపాటలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో తనదైన ముద్ర వేస్తోంది. అధ్యాపకుల సమష్టితత్వం అందుకు దోహదం చేస్తోంది. ఈ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్ విభాగాలు కొనసాగుతున్నాయి. గత విద్యా సంవత్సరంలో 20 మందికి పైగా విద్యార్థులు వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సులకు ఎంపికయ్యారు. 10 మంది బీఈడీ వైపు మళ్లారు. ఒకప్పుడు మహిళలు డిగ్రీ చేసిన తరువాత చాలా మంది చదువు మానేసేవారు. ప్రత్యేక శిక్షణతో ఇప్పుడు 50శాతానికి పైగా ఉన్నత కోర్సుల వైపు వెళ్తున్నారు.

కళాశాలలో ఇలా..

మొత్తం కోర్సులు: బీఎస్సీ(ఎంపీసీఎస్), బీఎస్సీ లైఫ్‌సైన్సెస్, బీకామ్ కంప్యూటర్స్, బీఏ

అధ్యాపకులు: 21, **విద్యార్థినులు:** 335

ప్రయోగశాలలు: 5(వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రం, కంప్యూటర్స్)

గ్రంథాలయం: 1(15 వేల పుస్తకాలు) | **డిజిటల్ తరగతులు:** 5 | **ఆర్‌వో ప్లాంట్:** 1

స్ఫూర్తిని కొనసాగిస్తాం..

కళాశాల చక్కటి ప్రగతిని సాధించింది. గతంతో పోల్చితే విద్యార్థినుల సంఖ్య పెరుగుతోంది. ఈ స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తాం. అధ్యాపకులు, సిబ్బంది సమష్టి సహకారంతో ఐఎస్‌వో గుర్తింపు దక్కింది. నిత్యం ప్రణాళికతో విద్యావిషయక అంశాలపై కసరత్తు చేస్తున్నాం.

-డా.జీవన్‌కుమార్, ప్రిన్సిపల్

దోహదం చేసిన అంశాలు

విద్యా సేవలు: అకడమిక్ రికార్డులను నిర్వహిస్తున్నారు. విద్యా ప్రమాణాలు పాటిస్తున్నారు. అర్హత, అనుభవం కలిగిన అధ్యాపకులు ఉండటం కలిసొచ్చే అంశం. ఆరుగురు పీహెచ్‌డీ, ముగ్గురు నెట్, సెట్ లాంటి వాటిల్లో అర్హత సాధించారు. వృత్తి నైపుణ్య కోర్సులు నిర్వహిస్తున్నారు. టీఎస్‌కేసీ నేతృత్వంలో విద్య, ఉద్యోగ, ఉపాధి సంబంధిత అంశాల్లో తర్ఫీదు అందిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ: కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకుల బృందం మొక్కలను దత్తత తీసుకొని పెంచుతున్నారు. వివిధ రకాల జాతుల వివరాలు తెలిపేలా క్యూఆర్ కోడ్ విధానాన్ని తెచ్చారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ-వ్యర్థాలు, తడి, పొడి చెత్త, ఇతరత్రావి చక్కగా నిర్వహిస్తున్నారు.

శక్తివనరుల పొదుపునకు కృషి: టీజీరెడ్‌కో సహకారంతో 18 తరగతి గదుల్లో 54 ఎల్ఈడీ ఫ్యాన్లు, 50కి పైగా ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్తు పొదుపు సుగమమైంది. గతంలో విద్యుత్తు బిల్లు దాదాపు రూ.20 వేల రాగా.. ప్రస్తుతం రూ.5 వేలకు తగ్గింది. ఇంకుడు గుంత ద్వారా నీటిని ఒడిసిపడుతున్నారు.

'కూరగాయల వ్యాపారం ఎలా నడుస్తోందమ్మా..'


పాతూరు మార్కెట్లో కాకరకాయలు కొంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: సిద్దిపేట నుంచి హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో ప్రజ్ఞాపూర్ శివారులో రాజీవ్ రహదారి పక్కన ఉన్న పాతూరు కూరగాయల మార్కెట్‌ను మాజీ మంత్రి హరీశ్ రావు బుధవారం రాత్రి సందర్శించారు. రైతుల వద్దకు వెళ్లి పలకరించారు. 'అమ్మ కూరగాయల వ్యాపారం ఎలా నడుస్తోంది' అని వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద కూరగాయలు కొనుగోలు చేశారు. గతంలో రోడ్డు పక్కన విక్రయించే వారిమని, ఎండకు, వానకు, చలికి పడుతున్న కష్టాలు చూసిన హరీశ్‌రావు.. మార్కెట్ నిర్మించి, జీవనోపాధి చూపించారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

సిద్దిపేట టౌన్: సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం పర్యటించారు. పలు కారణాలతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుసేన్, భారాస నాయకులు వేలేటి రాధాకృష్ణశర్మ, కడవేర్గు రాజనర్సు, పాల సాయిరాం తదితరులు ఉన్నారు.

రిజిస్టర్లు తనిఖీ చేసిన న్యాయమూర్తి


న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి స్వాతిరెడ్డి కోర్టు కార్యాలయంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ప్యానెల్ న్యాయవాదులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. కౌన్సిల్ న్యాయవాదులు ఆత్మారాములు, మల్లికార్జున్‌రాజు, రోహిణిరెడ్డి, రియాజుద్దీన్, కృష్ణమోహన్, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

సిద్దిపేట కలెక్టరేట్ ముందు ఆశా కార్యకర్తల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తూ..

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం సిద్దిపేట సమీకృత కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొంత తోపులాట జరిగి ఆశా కార్యకర్తల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, మరో ఆశా కార్యకర్త సొమ్మసిల్లి పడిపోయారు. కలెక్టరేట్‌లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన బీఆర్‌టీయూ నాయకులు మంచె నర్సింలు, శోభన్, శ్రీనివాస్, సిద్దేశ్వర్‌ను త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు సంతోష మాట్లాడుతూ.. తాము 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పనిభారం తగ్గించాలని కోరారు. జాబ్‌చార్ట్ ప్రకారం విధులు కేటాయించాలన్నారు. గత 26 రోజుల నుంచి నిరసన వ్యక్తం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవటం లేదన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారి వచ్చి వారి సమస్యలను తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. ఆందోళనలో సంఘం జిల్లా అధ్యక్షురాలు మేడోజు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.


బారికేడ్లతో అడ్డుకుంటున్న పోలీసులు


స్పృహ కోల్పోయిన రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష

3.82లక్షల ఎకరాల్లో యాసంగి సాగు

కార్యాచరణ సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ

విత్తనాలు..	సుమారుగా (క్వింటాళ్లలో)
వరి(వడ్లు)	52000
మొక్కజొన్నలు	4,000
పొద్దుతిరుగుడు	1100
శనగలు	20,000
వేరుశనగ	600

ఎరువుల	అంచనా (దాదాపు)
ఎరువు	టన్నుల్లో
యూరియా	23,069
డీఏపీ	10,972
కాంప్లెక్స్	18,561
ఎంఓపీ	9,474

న్యూస్‌టుడే, గజ్వేల్, సిద్దిపేట: జిల్లాలో యాసంగి(రబీ) సాగు ప్రణాళికలను వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. ఈసారి దాదాపు 3.82 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అత్యధికంగా 3.48లక్షల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశాలుండటంతో ధాన్యం రాశులు పోటెత్తనున్నాయి. వరి సాగు పూర్తిగా బోరు బావులపై ఆధారపడి సాగవుతుండటంతో విద్యుత్తు సరఫరాకు డిమాండు పెరగనుంది. ఇప్పటికే జిల్లాలో సుమారుగా 1.70 లక్షల బోర్లు వినియోగిస్తున్నట్లు అంచనా. ఆరుతడి, వరి ఇతర పంటలన్నీ బోరు బావుల ఆధారంగానే సాగు చేయనున్నారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు

యాసంగి సాగుకు ఉపక్రమించే రైతులకు విత్తనాలు, ఎరువుల పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాం. ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించనుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. **రాధిక, డీఏవో**



ప్రధాన పంట	విస్తీర్ణం అంచనా (ఎకరాల్లో)
వరి	3,48,009
మొక్కజొన్న	22,844
స్వీట్‌కార్న్	800
శనగ	4,242
వేరుశనగ	560
పొద్దుతిరుగుడు	9,871

స్వశక్తితో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


వస్త్ర సంచులు చూస్తున్న కలెక్టర్ మనుచౌదరి

హుస్నాబాద్ గ్రామీణం, హుస్నాబాద్: స్వశక్తి మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్)లో స్వశక్తి మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న నాన్ ఓవెన్ క్లాత్‌బ్యాగులు, పేపర్ ప్లేట్ల తయారీ, టైలరింగ్ యూనిట్లను సందర్శించారు. ఇటీవల దిల్లీలో జరిగిన మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరైన నిర్వాహకురాలు కనకతారను అభినందించారు. పెండింగులో ఉన్న ఏకరూప దుస్తుల కుట్టుకూలీ డబ్బులు ఇప్పించాలని ఈసందర్భంగా కలెక్టర్నను కోరారు. హుస్నాబాద్‌లోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలోని సైన్సు ప్రయోగశాలలను కలెక్టర్ సందర్శించారు.

సిద్దిపేట టౌన్: జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. సిద్దిపేట-రాజన్న సిరిసిల్లా జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలన్నారు. మెదక్-ఎల్కతుర్తి జాతీయ రహదారిలో మెదక్, సిద్దిపేట మధ్య వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ వైఫల్యం: కొత్త


కొనుగోలు ప్రారంభిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

దుబ్బాక, మిరుదొడ్డి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా.. కొనుగోలు చేపట్టకపోవడం, మిల్లులు కేటాయించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం దుబ్బాక పురపాలికలోని దుంపలపల్లి, చెల్లాపూర్, ధర్మాజీపేట వార్డుల్లో, రఘోత్తంపల్లి గ్రామం, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం దుబ్బాక-ముస్తాబాద్ రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయాలని దుబ్బాక ఏడీఈ గంగాధర్‌కు సూచించారు. మల్లన్న సాగర్ ఉప కాల్వలను పూర్తి చేయాలన్నారు. ఇక్కడి ప్రజలకు సాగునీరు ఇవ్వలేని ప్రభుత్వం... హైదరాబాద్‌కు మంచినీటిని అందించాలని చూడడం సరికాదన్నారు. పురాధ్యక్షురాలు గన్నె వనిత, కమిషనర్ రమేశ్ కుమార్, వైస్ ఛైర్‌పర్సన్ అధికం సుగుణ, కౌన్సిలర్లు శ్రీనివాస్, దేవలక్ష్మి, డీఎస్‌వో తనూజ పాల్గొన్నారు.

దళారులకు విక్రయించి మోసపోవద్దు: ఎమ్మెల్యే


దాచారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి, న్యూస్‌టుడే: రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం దేవక్కపల్లి, వడ్లూర్, గూడెం, లక్ష్మీపూర్, వీరాపూర్, దాచారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పీఏసీఎస్ ఛైర్మన్ శరత్‌రావు, ఏఎంసీ ఛైర్మన్ క్రిష్ణ, వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా శక్తి లక్ష్యాల సాధనకు కృషి

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళా శక్తి పథక లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య అన్నారు. బుధవారం హుస్నాబాద్‌లో ఐవోసీ కార్యాలయంలో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లోని గ్రామైక్య సంఘాల అధ్యక్షులు, వీఓఏలకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్నారు. 16 రకాల వ్యాపార యూనిట్లపై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు.

గ్రంథాలయ భవన నిర్మాణానికి చేయూత

దుబ్బాక, న్యూస్‌టుడే: దుబ్బాక పట్టణంలో కొత్త గ్రంథాలయం నిర్మించేందుకు కృషి చేస్తానని ఈ సంస్థ ఛైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం పాత ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలో అరకొర వసతులతో కొనసాగుతున్న శాఖ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించి, పలు రికార్డులను, పుస్తకాలను పరిశీలించారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పలువురికి పుస్తకాలను అందజేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి సుధీర్, రాజు ఉన్నారు.

సమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తాం


అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న గ్రామస్థులు

చిన్నకోడూరు: ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించాలని చిన్నకోడూరు మండలంలోని ఎల్లాయిపల్లి శివారులో చెల్కలపల్లి గ్రామస్థులు చేపట్టిన ఆందోళన బుధవారం సైతం కొనసాగింది. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి చెల్కలపల్లిలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిస్తామని, దానికి అనుగుణంగా ముందుకు సాగుదామన్నారు. దీంతో ధర్నా విరమించారు.

గాలికుంటు.. వ్యాప్తి మెండు

నివారణకు టీకాలు వేస్తున్న పశువైద్యులు


పశువుకు టీకా వేస్తున్న వైద్యురాలు

జిల్లాలో పశువులు..
గేదెలు: 84622 | ఆవులు: 60125
మొత్తం: 1,44,747

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: పశువులకు వ్యాధులు వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. జాతీయ పశువ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆవులు, గేదెలు, ఎద్దులకు టీకాలు వేసే ప్రక్రియ ఈనెల 16వ తేదీన ప్రారంభమైంది. ఈ కార్యక్రమం నవంబరు 15వ తేదీ వరకు కొనసాగనుంది. పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అన్నదాతలు అప్రమత్తంగా ఉంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించి జాగ్రత్తలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. గాలికుంటు టీకాను ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో మొత్తం 1,44,747 నల్లజాతి, తెల్ల జాతి పశువులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 21,841 పశువులకు వైద్య సిబ్బంది గాలికుంటు టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు.

కలిగే నష్టాలు...

● పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది.

● వ్యాధి సోకిన తల్లిపాలు తాగిన దూడల ఆరోగ్యం క్షీణిస్తుంది.

● సకాలంలో వైద్యం అందించకుంటే తీవ్రత పెరిగి మృత్యువాతపడుతాయి.

వ్యాధి లక్షణాలు..

● గాలికుంటు వ్యాధి సోకితే తీవ్ర జ్వరంతో పాటు పశువులు నీరసంగా కనిపిస్తాయి. ఎద్దుల్లో పని సామర్థ్యం తగ్గుతుంది.

● నోటి, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడుతాయి. నొప్పితో పశువులు మేత, నీరు తీసుకోక నీరసించి చనిపోతాయి.

● నోటి నుంచి తీగల మాదిరిగా సొంగ కారుతుంది.

నివారణ చర్యలు...

● పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలి.

● 4 నెలల వయసు దాటిన దూడలకు, పెద్ద పశువులకు, చూడి పశువులకు ఏడాదికి రెండు సార్లు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి.

చికిత్స: వ్యాధి సోకిన పశువులను వేరు చేసి పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ పూయాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి.

ప్రత్యేక కార్యాచరణ...

జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నెల రోజుల పాటు గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లాలోని 42పశువైద్య కేంద్రాలు, 51 సబ్ సెంటర్లలో కొనసాగుతోంది. జిల్లాలో 49 పశు వైద్య బృందాలు పని చేస్తున్నాయి. నవంబరు 15వ తేదీ వరకు కార్యక్రమం కొనసాగనుంది.

సద్వినియోగం చేసుకోవాలి..

వ్యాధి సోకితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతోంది. పశువులకు టీకాలు తప్పక వేయించాలి. అన్ని పశువైద్యశాలల్లో అందుబాటులో ఉన్నాయి. సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. **జగత్‌కుమార్ రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి**

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య: డీఈవో


విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈవో

దుబ్బాక, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు మెరుగైన విద్య లభిస్తుందని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న 18 మంది పద్మనాభునిపల్లి విద్యార్థులకు, 4 వరదరాజుపల్లి విద్యార్థులకు అమెరికాలోని బెస్ట్ రన్నర్స్ అసోసియేషన్ సంస్థ సహకారంతో అందజేసిన 22 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈవో జోగు ప్రభుదాస్, ప్రధానోపాధ్యాయులు పెంటయ్య, మల్లికార్జున్ గుప్తా, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు చేర్యాల విద్యార్థి



చేర్యాల, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ క్రీడోత్సవాల్లో భాగంగా 19 ఏళ్లలోపు విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు చేర్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి క్వర్రేల వరుణ్ ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ ఎన్.జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన వరుణ్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో చోటు దక్కించుకున్నాడని, త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆమె చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్, అధ్యాపక బృందం వరుణ్‌ను అభినందించి సన్మానించారు.

హాకీ పోటీలకు ఎంపిక



సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి హాకీ అండర్- 14, 17 పోటీలకు మల్కాపూర్ శివారులోని ప్రైవేటు స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14లో సోను, మహిర తంజీన్, చందన, ఇజ్రాయిల్, మహ్మద్ తకీఖాన్.. అండర్-17 పోటీలకు రిత్విక్, మహ్మద్ ఎంపికైనట్లు పాఠశాల ప్రతినిధులు చెప్పారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, శిక్షకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



క్రీడా జ్యోతిని అందజేస్తున్న బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి సైదులు

కొండపాక (గ్రామీణం), న్యూస్‌టుడే: క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని, ఉజ్వల భవిష్యత్తుకు దారిచూపుతాయని బీసీ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి బి.సైదులు అన్నారు. బుధవారం కొండపాకలోని మహాత్మా జ్యోతిబా ఫులే బీసీ గురుకుల పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లా బీసీ గురుకుల పాఠశాలల క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు జరిగే క్రీడల్లో విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, డిస్కస్ త్రో, షార్ట్‌పుట్, పరుగుపందెం, చదరంగం పోటీలలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని తెలిపారు. అంతకుముందు పాఠశాలలో క్రీడా జ్యోతిని వెలిగించి గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో బీసీ గురుకుల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిరుపతి, కొండపాక బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శివప్రసాద్ ఉన్నారు.

బాల ప్రతిభ.. భవిష్యత్తుకు నిచ్చెన

చదువులో ఉన్నతంగా బాలలు రాణించాలంటే కళలు, ఆటలు, ఇతర మంచి వ్యాపకాలు ఎంతో అవసరం. దీన్ని గుర్తించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తుండటంతో ఉత్తమ ప్రతిభ చాటుతూ రాణిస్తున్నారు. ఓవైపు చదువులో ఉత్తమ మార్కులు పొందుతూనే మరోవైపు నృత్యం, క్రీడల్లో ప్రతిభ చాటుతున్న బాలలపై కథనం.

పరుగే ప్రాణం



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకులంలో ఇంటర్ చదువుతున్న ఎం.సుభాష్ క్రీడల్లో పరుగుపోటీల్లో రాణిస్తున్నాడు. పలు పోటీల్లో విజయాలు సాధిస్తున్నాడు. పరిగి, కులకచర్ల, హైదరాబాద్ సరూర్‌నగర్‌లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. 100, 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్ అభినందించారు.

ఉత్తమ వికెట్ కీపర్



కొడంగల్: కొడంగల్ గిరిజన గురుకులంలో 8వ తరగతి చదువుతున్న ఆర్.సునీల్ క్రికెట్‌లో విజయాలు సాధిస్తున్నాడు. ఈ నెల 2న వికారాబాద్‌లో అండర్ 14 క్రికెట్ పోటీల్లో ఉత్తమ వికెట్ కీపర్‌గా సునీల్ బంగారు పతకం సాధించాడు. రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. ఇక్కడే 7వ తరగతి చదువుతోన్న సాగర్.. ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా రాణించి బంగారు పతకానికి అర్హుడయ్యాడు. ఫైనల్లో 29 బంతుల్లో 42 పరుగులు తీశాడు.

ఇటు చదువు.. అటు క్రీడలు



జహీరాబాద్: జహీరాబాద్ మండలం హోతి (కె) శివారులో గల తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నందిని రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడల పోటీలకు ఎంపికైంది. అమ్మానాన్న కవిత, గోపాల్. శిక్షకుల సరిత, నాగయ్య ప్రోత్సాహంతో చదువు, క్రీడలను సమన్వయం చేసుకుంటూ, రాణిస్తోంది. రోజూ తెల్లవారుజామునే లేచి వ్యాయామం, ఆట సాధన చేస్తుంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

క్యూబింగ్‌లో పతకం



తాండూరు: తాండూరుకు చెందిన కందుకూరి చైత్ర రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో సంస్థ నిర్వహించిన రూబిక్స్ స్పీడ్ క్యూబింగ్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో గచ్చిబౌలిలో పోటీ నిర్వహించగా 41 సెకన్లలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసింది. తాండూరు నేతాజీ గురుదేవ్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న చైత్రను తల్లిదండ్రులు వాణి, రాజ్‌కుమార్ ప్రోత్సహించారు. త్వరలో జాతీయ స్థాయిలో పోటీ పడగలని మెలకువలు నేర్చుకుంటున్నానని చైత్ర చెప్పింది.

ఎన్‌సీసీ వేదికతో గుర్తింపు



గజ్వేల్ గ్రామీణం: చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన అతను చదువుతోపాటు ఆటల్లో, ఎన్‌సీసీలో రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చుకుంటూ సత్తా చాటుతున్నాడు గజ్వేల్ పట్టణానికి చెందిన దూడల మణికంఠ. తల్లి మంగమ్మ టైలరింగ్ పనులు చేస్తూ కుమారుడిని చదివిస్తున్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని చదువులో, ఆటలో రాణిస్తున్నాడు. గత మేలో హైదరాబాద్ ఎన్‌సీసీ శిబిరంలో పాల్గొని ప్రతిభ చాటుకోవడంతో అధికారులు జాతీయస్థాయి ట్రెక్కింగ్ క్యాంపునకు ఎంపిక చేశారు. ఈనెల రెండో వారంలో తిరుపతిలో ట్రెక్కింగ్ జరిగింది. మణికంఠ ప్రశంసాపత్రం అందుకున్నాడు. భవిష్యత్తులో ఆర్మీలో చేరాలనేది కోరిక అని బాలుడు చెప్పాడు.

స్రగ్వీ ఆదర్శం



జోగిపేట: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది జోగిపేటకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎ.స్రగ్వీ. ప్రైవేటు బడిలో చదువుతోంది. తల్లిదండ్రులు శ్రీకాంత్, కరుణలు జోగిపేట క్రికెట్ కోచింగ్ కేంద్రంలో సంవత్సరం క్రితం చేర్పించారు. శిక్షకులు సల్మాన్, శివ వద్ద రాటుదేలుతోంది. నిత్యం ఉదయం 5 గంటలకే లేచి తండ్రితో కలిసి సాధన కోసం వెళ్తోంది. సాయంత్రం, సెలవు రోజుల్లోనూ సాధన చేస్తుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లలో పరిణతి పొందింది. సంగారెడ్డిలో ఎస్‌జీఎఫ్‌లో ప్రతిభ చాటి అండర్-17 పోటీలకు ఎంపికైంది.

రాష్ట్ర స్థాయిలో ప్రాతినిధ్యం



తాండూరు: యాలాల మండలం ముకుందాపూర్‌కు చెందిన అర్చన రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో 2 కి.మీ. పరుగులో ప్రతిభ కనబరిచింది. బంగారు పతకాన్ని సాధించింది. రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. యాలాల పాఠశాలలో 9వతరగతి చదువుతున్న అర్చన.. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించే దిశగా సాధన చేస్తోంది.

నర్తిస్తారు.. మెప్పిస్తారు

వికారాబాద్ కలెక్టరేట్: వికారాబాద్ బాల కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థినులు శాస్త్రీయ, సంప్రదాయ పాటలు, భక్తి పాటలు, దేశభక్తి, జానపద పాటలకు అందరూ మెచ్చేలా నృత్యం చేస్తారు. గత నెలలో కాశీ విశ్వనాథస్వామి గుడిలో 'రావణకృత శివతాండవం' నృత్యం చేసి భక్తులను అలరించారు. శ్రేయాన్వి, అనన్య, రష్మిక, పరిణతమాంబ, సౌమ్య, సృజన, వేదశ్రీ, సంహిత, జాహ్నవి, భవిత, శ్రీనిధి పాల్గొన్నట్లు, ఆలయ ట్రస్టు నుంచి ప్రశంసాపత్రం అందుకున్నట్టు బాల కేంద్రం సూపరింటెండెంట్, శిక్షకురాలు టీపీ అనురాధ తెలిపారు. గతంలో హైదరాబాద్, విజయవాడ, చెన్నైలోనూ పోటీల్లో పాల్గొని విజయం సాధించారు.



కాశీలో నృత్యం చేసిన బాలలు

అబ్బురపరిచే కళ



దుబ్బాక: దుబ్బాక మండలం రామక్కపేట విద్యార్థి బండి క్రాంతికుమార్.. చిన్నతనం నుంచే చిత్రలేఖనం (డ్రాయింగ్)పై మక్కువ పెంచుకున్నాడు. దుబ్బాక పురపాలికలోని లచ్చపేట ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు చంద్రకళ, భూమయ్య బీడీ కార్మికులుగా పని చేస్తూనే కుమారుడిని ప్రోత్సహిస్తున్నారు. పెన్సిల్, స్కెచ్, రంగులతో జాతీయ నాయకులు, దేవుళ్లు, ప్రకృతిని గీస్తూ అబ్బురపరుస్తున్నాడు. వర్గల్‌లో వికసిత్ భారత్‌పై చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ చాటాడు. సమగ్రశిక్షా ఆధ్వర్యంలో సిద్దిపేటలో కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచాడు. నవంబరులో రాష్ట్రస్థాయిలో పాల్గొననున్నాడు.



శరణ్యతో ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్, ఉపాధ్యాయులు

12 కథలు రాసిన బాలిక

హవేలిఘనపూర్: హవేలి ఘనపూర్ మండలం ఔరంగాబాద్‌కు చెందిన చెప్యాల మంజుల-సిద్ధయ్య దంపతుల కుమార్తె శరణ్య. హవేలి ఘనపూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. బాలసాహిత్య పీఠం నిర్వహించిన కథల పోటీల్లో 'జయహో' కథ బహుమతికి ఎంపికైంది. శరణ్య రెండేళ్ల నుంచి కథలు రాస్తోంది. ఉపాధ్యాయుడు ఉండ్రాళ్ల రాజేశం మెలకువలు నేర్పించారు. బాలిక 12 కథలు రాసింది. గతంలో తెలంగాణ సార్వసత పరిషత్ నుంచి బహుమతి అందుకుంది.

క్రమశిక్షణలో ముందు



ప్రహర్షికి అభినందనలు

సిద్దిపేట అర్బన్: నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రహర్షి కథల పుస్తకాలు రాస్తూ తెలుగు సాహిత్యంలో రాణిస్తోంది. తల్లిదండ్రులు కారంకంటి కనకయ్య-రజిత. తండ్రి ఆటో నడుపుతున్నారు. తల్లి టైలరింగ్ చేస్తూ ముగ్గురు పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. 6వ తరగతి నుంచి ప్రహర్షి ప్రతిభ చాటుతోంది. నేషనల్ మీన్స్ మెరిట్ ఉపకార వేతనానికి ఎంపికైంది. అందమైన చేతిరాత బాలిక సొంతం. రోజూ ఉదయాన్నే 4 గంటలకు నిద్ర లేవడం అలవాటుగా చేసుకుంది. నాలుగు కథలు రాసింది. గతేడాది రాసిన మాంత్రికుని కోటలో చిన్న పిల్లలు కథల పుస్తకానికి రూ.500 బహుమతి అందుకుంది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాల సాహిత్య పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలో ప్రహర్షి రాసిన 'సాహసం' కథ ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. నవంబరు 3న హైదరాబాద్‌లో ప్రదానం చేయనున్నారు.

శాకాహారమే శ్రేష్ఠమైంది

ధ్యాన కేంద్రంలో సూచనలు

నర్సాపూర్, న్యూస్‌టుడే: మాంసాహారం తినడం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలను శాకాహారం వైపు మళ్లించడానికి కొన్ని సంస్థలు ప్రయత్నం చేస్తున్నాయి. మనిషిలో పలు రోగాలకు కారణం మాంసాహారమేనని, శ్రేష్ఠమైన ఆహారం అంటే శాకాహారమేనని వారు చాటిచెబుతున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఇటీవల పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గతంలో సెలవుదినాలు, పండగలు, ఎవరైనా చుట్టాలు వచ్చినప్పుడు మాత్రమే మాంసాహారాన్ని తీసుకునేవారు. ప్రస్తుతం కూరగాయలు, పప్పు దినుసులతో వంట చేసుకొని భోజనం తగ్గిపోయింది. నిత్యం మూడు పూటలా మాంసాహారం ప్రాధాన్యం పెరిగిపోయింది. పిల్లల్లో చదువులపై, పెద్దలకు శరీరంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వారు చెబుతున్నారు. నర్సాపూర్ పట్టణంలో ర్యాలీలో నినాదాలు చేస్తూ.. మాంసాహారం వల్ల నష్టాలను వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. మూగజీవులను సంరక్షించండి, అహింసాయుత భూమాతను ఆవిష్కరించడంలో భాగంగా అవగాహన చేపడుతున్నట్టు తెలంగాణ పిరమిడ్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు పేర్కొన్నారు. ధ్యాన కేంద్రంలో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, బుద్ధి వికాసం, ఆత్మ జ్ఞానానికి ధ్యానం అవసరాన్ని బోధిస్తారు.

సాత్వికాహారంతోనే ఆరోగ్యం: రాములుయాదవ్, ధ్యాన కేంద్రం నిర్వాహకుడు

అనారోగ్యం కారణంగా 2011 నుంచి శాకాహారానికి మారాను. ఎంతో చలాకీగా ఉండగలుగుతున్నాను. సాత్వికాహారంతోనే ఆరోగ్యంగా ఉండగలం. ధ్యానం వలన ప్రయోజనాలు ఉన్నాయి.



నర్సాపూర్‌లో శాకాహారంపై ర్యాలీ

పెద్దల జ్ఞాపకం.. పదుగురికి ఉపయుక్తం

పరిగి, మోమిన్‌పేట, న్యూస్‌టుడే:

- మోమిన్‌పేటకు చెందిన మల్లేశం ఏడాది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల ఉన్నట్టుండి స్పృహ కోల్పోయారు. ఆసుపత్రికి తీసుకువెళ్లేందుకు గంట నుంచి ఆటో కోసం కుటుంబ సభ్యుల వెదికారు. విషయం తెలిసిన అల్లుడు ఉచిత సేవలు అందిస్తున్న ఆటోను వినియోగించుకొని సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- మోమిన్‌పేటకు చెందిన పల్లవి గర్భవతి. పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లాల్సి ఉంది. ఊరిలోనే ఆసుపత్రి ఉన్నా దూరం కావడంతో ఆటోవాలాలు ఎవరూ రాలేదు. ఉచిత వాహనం సద్వినియోగమైంది.
- మల్లమ్మ తన కూతురు వద్దకు వెళ్లేందుకు ఇంటి నుంచి బస్టాండుకు బయల్దేరారు. మార్గమధ్యలో కాళ్లనొప్పితో కూర్చున్నారు. ఓ మహిళ ఇచ్చిన సమాచారంతో ఆమెను బస్టాండులో ఉచిత వాహనంలో వదిలారు.



ఎలక్ట్రిక్ వాహనం ఇదే

పదుగురికి మేలు చేయాలన్న ఓ యువకుడి ఆలోచన ఆచరణలోకి వచ్చి వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో ఉపయోగపడుతోంది. ఒక్కోసారి ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఆటోవాలాలు, ఇతర వాహనదారులు డిమాండు చేసి డబ్బు తీసుకొని వాహనంలో తీసుకెళ్తారు. ఉచిత ప్రయాణంతో యువకుడు ఆదర్శంగా నిలుస్తున్నారు. మోమిన్‌పేటకు చెందిన మహంతిరెడ్డిగారి విష్ణు తమ తల్లిదండ్రులు మహంతి రెడ్డి, స్వప్నల పేరిట వృద్ధులు, గర్భిణులు, కాలినడకన వెళ్లే విద్యార్థుల కోసం ఉచిత ప్రయాణం అందించాలని భావించారు. ఇదే విషయాన్ని అన్న లక్ష్మీకాంత్‌రెడ్డి, సోదరి సుష్మారెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో అంగీకరించారు. రూ.6లక్షలు వెచ్చించి పర్యావరణానికి మేలు కలిగించే ఎలక్ట్రిక్ వాహనాన్ని బెంగళూరు నుంచి కొనుగోలు చేసి తెప్పించారు. గ్రామం చివరి నుంచి బస్టాండు వరకు రెండు కిలోమీటర్ల దూరం ఉండటంతో ఇది ఉపయోగపడుతోందని చెబుతున్నారు. ఈనెల 5న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనాథశ్రమంలో ఉంటూ బడికి వెళ్తున్న విద్యార్థులను ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచిత వాహనంలో తరలిస్తున్నారు.

బడికి తీసుకెళ్లే బస్సే బలిగొంది

సహాయకుడు లేకపోవడంతో చిన్నారిని ఢీకొట్టిన డ్రైవర్



చిన్నారి అశ్విని

ఘటనాస్థలంలో విలపిస్తున్న బంధువులు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: నిత్యం టాటా చెబుతూ చిరునవ్వుతో బడికి వెళ్లే ఆ చిన్నారి ఆనందాన్ని చూసి విధికి కన్నుకుట్టిందేమో.. ప్రతి రోజూ పాఠశాలకు తీసుకెళ్లే బస్సే బాలిక పాలిట మృత్యుశకటంగా మారి బలి తీసుకుంది. క్షేమంగా తిరిగి వస్తుందనుకున్న తమ కూతురు తిరిగి రాని లోకాలకు వెళ్లిందన్న సమాచారం తెలుసుకుని కన్నవారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పెద్దశంకరంపేట మండలం మక్తలక్ష్మాపురం గ్రామం వద్ద ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు ఢీకొని విద్యార్థిని దుర్మరణం చెందిన ఘటన బుధవారం జరిగింది. సీఐ రేణుక తెలిపిన ప్రకారం మక్తలక్ష్మాపురం గ్రామానికి చెందిన బోయిని చంద్రమోహన్, సరితలకు ఇద్దరు కుమార్తెలు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెద్ద కుమార్తె అశ్విని (6) పెద్దశంకరంపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల బస్సులోనే బడికి వెళ్లి, సాయంత్రం తిరిగి వచ్చింది. రోడ్డు దాటుతుండగా డ్రైవర్ చూసుకోకుండా బస్సును ముందుకు పోనివ్వడంతో అశ్వినిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో డ్రైవర్ పరారయ్యాడు. బస్సులోని విద్యార్థులు భయంతో ఇళ్లకు పరుగులు తీశారు. సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు అక్కడికి చేరుకుని బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్, పాఠశాల యాజమాన్యం గ్రామానికి వచ్చే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని బంధువులు, గ్రామస్థులు రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యం చేసుకుని సర్ది చెప్పడంతో విరమించారు. మృతదేహాన్ని జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి దుర్మరణం



మహమూద్ మియా

పాపన్నపేట, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో విశ్రాంత ఉద్యోగి మృతి చెందిన ఘటన పాపన్నపేట శివారులో బుధవారం జరిగింది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం యూసుఫ్‌పేటకు చెందిన మహమూద్ మియా (65) స్థానిక తపాలా కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందారు. బుధవారం మధ్యాహ్నం స్కూటీపై పాపన్నపేటకు కూరగాయల కొనుగోలుకు వస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వాహనం ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మహమూద్ మియాకు భార్య కౌసర్ సుల్తానా, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడు రోజుల కిందట చిన్న కుమార్తె నిశ్చితార్థం జరిగింది. అంతలోనే ఇలా జరగడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగింది.

ఎదురెదురుగా బైకులు ఢీకొని ఎలక్ట్రీషియన్..



బాలకృష్ణ

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం కంచన్‌పల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయం వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దుంపల నాగమణి, విఠల్ కుమారుడైన బాలకృష్ణ (21) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. మానెపల్లి గ్రామానికి జంగల్ల భూమేశ్‌తో కలిసి వెళ్తున్నారు. మానెపల్లి నుంచి ఎదురుగా వస్తున్న తల్లీకుమారులు పెంటయ్య, నర్సమ్మల వాహనం ఢీకొంది. ప్రమాదంలో కింద పడిన బాలకృష్ణ తలకు తీవ్రగాయాలయ్యాయి. అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. నర్సమ్మకు గాయాలు కావడంతో నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాలకృష్ణ తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలం కూచనపల్లికి చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి(55) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు. అక్కన్నపేట మండలంలో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టులో గుడాటిపల్లి గ్రామం ముంపునకు గురైంది. దీనితో రాజిరెడ్డి కూచనపల్లిలో ఇల్లు నిర్మించుకున్నాడు. అతిగా మద్యం తాగడంతో ఆరోగ్యం చెడిపోయింది. చికిత్స తీసుకున్నా నయం కాలేదు. ఈ నెల 22న తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్దూరు మండలంలో మరో యువకుడు..



రాజు

చేర్యాల(మద్దూరు), న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూరు గ్రామ రైతు కుటుంబానికి చెందిన పూల మల్లేశం- బూదమ్మ ఏకైక కుమారుడైన రాజు(22) బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. డిగ్రీ వరకు చదివిన రాజు కొన్నాళ్ల క్రితం వరకు స్థానిక పాల ఉత్పత్తిదారుల కేంద్రంలో పని చేశాడు. వ్యవసాయంలో తల్లిదండ్రులకు సాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పొలంలో తీసిన పత్తి విక్రయించిన అనంతరం సాయంత్రం తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కడుపులో నొప్పి వేస్తోందని తన మిత్రుడికి చెప్పడంతో వెంటనే లద్నూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు జనగామ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. అతని ఆత్మహత్యకు కారణం తెలియలేదు. ఈ ఘటనపై మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్‌ను అడుగగా ఆత్మహత్య సమాచారం ఉంది కానీ దానిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు. ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామన్నారు.



లెక్కిస్తున్న సిబ్బంది, సేవాసమితి సభ్యులు

వనదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.39.91 లక్షలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి హుండీల ద్వారా రూ.39,91,361 ఆదాయం సమకూరింది. దీనికి అదనంగా బంగారం, వెండి ఆభరణాల కానుకలొచ్చాయి. ఈవో చంద్రశేఖర్, హుండీ లెక్కింపు ఇన్‌ఛార్జి సుధాకర్‌రెడ్డి సమక్షంలో ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు గోకుల్‌షెడ్‌లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. 83 రోజుల్లో ఆ ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

ఆధునిక పరికరం.. ప్రమాదాల నివారణం

న్యూస్‌టుడే, జిన్నారం:

పరిశ్రమల్లో చిన్న లోపం ఉన్నా ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసే వ్యాపారులకు తెలిసేలా ప్రభుత్వం పర్యవేక్షిస్తోంది. దీనివల్ల పరిశ్రమల యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఉత్పత్తి ప్రాసెస్‌లో తేడా ఉంటే వ్యాపారులు వస్తువులను కొనరు. ఉత్పత్తి విషయంలోనైనా ప్రమాదాల నివారణకైనా ఆధునిక సాంకేతిక పరికరాల ద్వారా అప్రమత్తం అవుతున్నారు. పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని కర్మాగారాల భద్రతా శాఖ యాజమాన్యాలను అప్రమత్తం చేస్తోంది.



రియాక్టర్ వద్ద ఆటోమేటిక్ యంత్రం

రియాక్టర్లు, రసాయనాల నిల్వ ప్రాంతాలు కీలకం

పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే ప్రాణ, ఆస్తి నష్టం ఉంటుంది. యూనిట్లలో ఎక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటాయో అక్కడే దృష్టి సారిస్తున్నాయి యాజమాన్యాలు. రియాక్టర్, సెంటర్ ఫీజ్, బాయిలర్, చిల్లింగ్ పాయింట్, రసాయనాల నిల్వ ప్రాంతాల్లో పరికరాలు ఏర్పాటు చేస్తున్నాయి. ప్రమాదాన్ని గుర్తించి వాటంతటవే నివారిస్తాయి. కార్మికులకు చిన్న పాటి ప్రమాదం జరిగితే అత్యవసర కంటి శుభ్ర షవర్‌లను ఏర్పాటు చేసుకున్నారు.

కార్మికులకు చైతన్యం

పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడిని చైతన్యం చేసే చర్యలు ప్రతి పరిశ్రమలో కనిపిస్తాయి. మాక్‌డ్రిల్ ద్వారా కార్మికుల అప్రమత్తతను పరీక్షిస్తారు. నెలకు ఓసారి మాక్ డ్రిల్ ఉంటుంది. పరిశ్రమల గోడలపై కార్మికులు, ప్రతినిధుల అవగాహనకు చిత్రాలు వేస్తారు. అవి చాలా తోడ్పడతాయని ఎస్ఎంఎస్ పరిశ్రమ ప్లాంట్ హెడ్ టీఎస్ఎం శేఖర్ చెప్పారు. కార్మికులకు భద్రత పోటీలు నిర్వహిస్తారు. చైతన్యం కలిగిస్తారు. ఉత్పత్తులకు ఆర్డర్లు ఇచ్చే వివిధ దేశాల ప్రతినిధులు సైతం కార్మికుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను ఆరా తీస్తారు.

అప్రమత్తతే ఆయుధం

– పీవీ నాయుడు, పరిశ్రమ భద్రతా విభాగ అధికారి



పరిశ్రమల్లో పని చేసే ప్రతి కార్మికుడు అప్రమత్తంగా ఉండాలి. యాజమాన్యాలు ప్రత్యేక శిక్షణ ఇవ్వటంతో పాటు అందుబాటులోకి వచ్చిన పరికరాలను సమకూర్చుకుంటాయి. అన్ని రకాల రసాయన పరిశ్రమల్లో ఈ విధానం కనిపిస్తుంది.

మార్పులతోనే మార్కెట్‌ను ఎదుర్కోగలం

– నాగేశ్వరరావు, పరిశ్రమల విభాగం ఎండీ, ఐడీఏ బొల్లారం



ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యాజమాన్యాలు మార్చుకుంటున్నాయి. అప్పుడే నేటి మార్కెట్‌ను ఎదుర్కోగలమని గ్రహించారు. ఆధునిక పరికరాలు సమకూర్చుకుంటున్నాయి.

'కాగ్నిజెంట్'లో గురుకుల విద్యార్థులు

వర్గల్, న్యూస్‌టుడే: వర్గల్ మహాత్మా జ్యోతిబా పులే వెనుకబడిన తరగతుల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థినులు బుధవారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని కాగ్నిజెంట్ సంస్థను సందర్శించారు. విద్యాలయం నుంచి వెళ్లిన 15 మంది విద్యార్థినులతో విదేశాలకు చెందిన సంస్థ ప్రతినిధులు మమేకమై పలు అంశాలపై అవగాహన కల్పించారు.

సమీకృత మార్కెట్ సందర్శన

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ సమీకృత మార్కెట్‌ను సూర్యాపేట జిల్లా మార్కెటింగ్, పురపాలక శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. డీఎంవో సంతోష్ కుమార్, డీఈ సత్యనారాయణ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు మార్కెట్లో కలియతిరిగి రైతులు, వ్యాపారులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లో జరుగుతున్న లావాదేవీల గురించి కార్యదర్శి జాన్ వెస్లీ వారికి వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

భక్తిశ్రద్ధలతో పూజలు



గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు కట్టపై ఉన్న కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి విశేష పంచామృత అభిషేకం నిర్వహించి సిందూరంతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక హోమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కార్యకర్తల సంక్షేమమే భారాస ధ్యేయం: వంటేరు



బాధితులకు బీమా చెక్కు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి తదితరులు

కుకునూరుపల్లి(కొండపాక గ్రామీణం): కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బీమా సదుపాయాన్ని కల్పించారని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. కుకునూరుపల్లి మండలం మేదినీపూర్ గ్రామానికి చెందిన భారాస కార్యకర్త కిష్టాపురం నర్సయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ మేరకు బుధవారం మేదినీపూర్‌లో రూ.2 లక్షల బీమా చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు ప్రతాప్‌రెడ్డి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారాస కార్యకర్తలకు పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవి రవీందర్, మాజీ సర్పంచి దశరథం, నాయకులు లక్ష్మణ్‌రాజ్, నాగరాజు, కనకయ్య, సాగర్ తదితరులు ఉన్నారు.

అవగాహనతోనే మూఢనమ్మకాల నిర్మూలన

హుస్నాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక సేవ భావాన్ని అలవర్చుకోవాలని, అవగాహనతోనే మూఢనమ్మకాలను నిర్మూలించవచ్చని హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయగిరి భిక్షపతి అన్నారు. బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో జాతీయ సేవా కార్యక్రమం(ఎన్ఎస్ఎస్)పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విషయ నిపుణులు వొడ్నాల చంద్రమౌళి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ద్వారా చేపట్టే వివిధ సేవా కార్యక్రమాల గురించి తెలిపారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి నయనాదేవి, వైస్ ప్రిన్సిపల్ కుమారస్వామి, అధ్యాపకులు సబీ ఫాతిమా, అనిత, సుధామాధురి, బాలరాజు, శ్రీనివాస్, చంద్రమౌళి, అనిల్‌కుమార్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన సరికాదు: భారాస



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని భారాస నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పాల సాయిరాం మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ఎంపీ, ఎమ్మెల్యే లేదంటే పీఏసీఎస్ ఛైర్మన్లు ప్రారంభించాలన్నారు. ఎలాంటి పదవులు లేని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూజల హరికృష్ణ అధికారుల ప్రోత్సాహంతో కేంద్రాలు ప్రారంభించడం సరికాదన్నారు. రాగుల సారయ్య, జాప శ్రీకాంత్‌రెడ్డి, భూపేశ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సిద్దిపేట టౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవాణి పాఠశాలలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విచక్షణతో కూడిన చరవాణి వాడకం అనే అంశంపై 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కృపాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక శిక్షణ.. ఉపాధికి ఊతం

ఏటీసీ ఏర్పాటుతో యువతలో నైపుణ్యాభివృద్ధి

కొండపాక (గ్రామీణం), న్యూస్‌టుడే: చదువుకున్న యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోంది. ఆ దిశగా ఐటీఐ కళాశాలల్లో విద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ అందక లక్ష్యం నెరవేరడం లేదు. సమస్యను గుర్తించిన ప్రభుత్వం.. యువతలో సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించే భాగంగా ఐటీఐ కళాశాలలను ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్)లుగా మార్చాలని నిర్ణయించింది. టాటా గ్రూపు సహకారంతో ఈ కళాశాలలను కలిసి పనిచేస్తోంది. ఈ మేరకు జిల్లాలో మొదటిగా కుకునూరుపల్లిలోని ఐటీఐ కళాశాలను ఏటీసీగా ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై కథనం.



ప్రిన్సిపల్ చేతులమీదుగా ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులు

ఆరు రకాల కోర్సులు

కుకునూరుపల్లిలో సుమారు 10 వేల చ.అ. విస్తీర్ణంలో ఏటీసీ భవన నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శిక్షణ విలువగా 40 కంప్యూటర్లు, అవసరమైన యంత్ర సామగ్రి ఇప్పటికే కళాశాలకు చేరింది. 1. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, 2. ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, 3. ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, 4. బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫయర్, 5. అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, 6. మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ వంటి ఆరు కోర్సులను ఈ ఏడాది ప్రారంభిస్తున్నారు.

ఈ నెల 30 వరకు ప్రవేశాలు

ఏటీసీలో ప్రవేశాలు పొందడానికి పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు. ఆన్‌లైన్‌లో https://iti.telangana.gov.in ఈ నెల 30వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 172 సీట్లు అందుబాటులో ఉన్నాయి. కొన్ని కోర్సులు ఏడాది, మరికొన్ని కోర్సుల్లో రెండేళ్ల పాటు విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ప్రవేశం పొందడంలో ఇబ్బందులుంటే నేరుగా కళాశాలకు వెళితే.. అక్కడే రిజిస్ట్రేషన్ చేసి ప్రవేశాలు కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

– డి.వెంకటరమణ, ప్రిన్సిపల్, ఐటీఐ కళాశాల, కుకునూరుపల్లి

ప్రభుత్వం మొదటిసారిగా ప్రారంభిస్తున్న ఏటీసీ కేంద్రాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. నైపుణ్యాలు పెంపొందించుకుంటే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఇది చక్కటి అవకాశం.

ఐఎంఏ అధ్యక్షుడికి సన్మానం



నూతన అధ్యక్షుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్ గ్రామీణ: గజ్వేల్ ఐఎంఏ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ నాగమయ్య, ఉపాధ్యక్షులుగా మిత్రజ్యోతి, ప్రధాన కార్యదర్శిగా చంద్రారెడ్డి, కోశాధికారిగా సాయినాథరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా శైలజ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ యాదవరెడ్డి ఘనంగా సన్మానించారు. సీనియర్ వైద్యులు పెంటారెడ్డి, లింగం, తదితరులు ఉన్నారు.

27న ప్రొ. సాయిబాబా సంస్మరణ సభ

సిద్దిపేట: దిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్, మానవ హక్కుల కార్యకర్త జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను ఈ నెల 27న సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు రాగుల భూపతి తెలిపారు. సిద్దిపేటలో ఆహ్వాన పత్రికను బుధవారం ఆవిష్కరించారు.

ఐక్యంగా ఉద్యమిద్దాం.. హక్కులు సాధిద్దాం

చేర్యాల: చట్ట ప్రకారం కల్లుగీత కార్మికులకు దక్కాల్సిన హక్కులు, న్యాయంగా సాధించుకోవాల్సిన డిమాండ్ల సాధనకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. సంఘం 67వ వార్షికోత్సవాల్లో భాగంగా కొమురవెల్లి మండలకేంద్రం, ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి, తదితర గ్రామాల్లో బుధవారం జెండా ఆవిష్కరించారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలి'

సిద్దిపేట టౌన్: గత ప్రభుత్వం అమలు చేస్తామన్న హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని వీఆర్‌ఏ వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుడిమల్ల రాజలింగం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిద్దిపేటలో బుధవారం వీఆర్‌ఏ వారసుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు పేస్కేలు, వారసులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. సుందర్, ప్రశాంత్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

25న భద్రాచలం నుంచి మహా పాదయాత్ర

హుస్నాబాద్: దళితులు కలిసి ఉండి రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలనే ప్రయత్నంలో భాగంగా ఈనెల 25న భద్రాచలంలో మాలల మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ ఆరె కిషోర్ తెలిపారు. బుధవారం హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాల శ్రీనివాస్, తదితరులున్నారు.

జీటీఏ నూతన కార్యవర్గం

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం(జీటీఏ) జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.బాపురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.పూర్ణచందర్‌రావు, ఉపాధ్యక్షులుగా దామోదర్, కార్యదర్శులుగా జె.శ్రీనివాస్, మహిళా ప్రతినిధులుగా అర్చన, శశికళ, గౌరవ అధ్యక్షుడిగా అన్నమారెడ్డి, తదితరులు ఎన్నికయ్యారు.

'అర్హులకు వెంటనే ఇళ్లు ఇవ్వాలి'

గజ్వేల్, న్యూస్‌టుడే: గజ్వేల్ పట్టణంలో అర్హులైన పేదలందరికీ రెండు పడక గదుల ఇళ్లు వెంటనే అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సందెబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం గజ్వేల్‌లో మాట్లాడారు. లాటరీ ద్వారా పేదలను ఎంపిక చేసి రెండేళ్లవుతున్నా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. నాయకులు రంగారెడ్డి, మనోజ్ కుమార్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: డీపీవో



మాట్లాడుతున్న దేవకిదేవి

దుబ్బాక, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారిణి దేవకిదేవి అన్నారు. బుధవారం దుబ్బాక మండల ప్రజా పరిషత్‌లో దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్, తొగుట మండలాల పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లెల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ నీటిని అందించాలన్నారు. సమావేశంలో డీఎల్పీవో మల్లికార్జున్‌రెడ్డి, దుబ్బాక ఎంపీడీవో భాస్కరశర్మ, ఆయా మండలాల ఎంపీవోలు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కొండపాక గ్రామీణం: కొండపాకకు చెందిన అమెరికా నివాసి విజయ్‌మోహన్ ఆయన తాతయ్య అనంతుల జ్ఞానప్రకాశ్ తండ్రి శ్యామ్ జ్ఞాపకార్థం విజయ్‌మోహన్ చేతులమీదుగా స్టీల్ బ్యాంకును గ్రామపంచాయతీకి వితరణ చేశారు. కార్యక్రమానికి హాజరైన డీపీవో దేవకిదేవి, విశ్రాంత ఎయిర్ కమాండర్ తులసీరామ్, తదితరులు దాత విజయ్‌మోహన్‌ను అభినందించారు.

సంతలో చింతలు తీరేనా?



పల్లెల్లో రైతులు పండించిన కూరగాయలను పలు గ్రామాల్లో నిర్వహించే వారసంతల్లో విక్రయిస్తారు. కుకునూరుపల్లిలో ప్రతి శుక్రవారం జరిగే వారాంతపు సంతలో కనీస సౌకర్యాలు కరవై రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ రైతులు తైబజార్ రుసుం సైతం చెల్లిస్తుండడంతో పంచాయతీకి ఏటా రూ.నాలుగైదు లక్షల ఆదాయం సమకూరుతోంది. ఇంత ఆదాయం వస్తున్నా ఎక్కడా కనీస వసతులు కానరావడం లేదు. గడిచిన ముప్పై ఏళ్లుగా ఇక్కడ సంత కొనసాగుతున్నా.. వసతులు కల్పించడంలో అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. ఇక్కడికి పదిహేను గ్రామాల ప్రజలు వస్తారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి స్వప్నను వివరణ కోరగా.. సంతలో నెలకొన్న సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కుకునూరుపల్లి (కొండపాక గ్రామీణం):

సారూ.. వేగనియంత్రికలు అమర్చరూ!



ప్రయాణం సాఫీగా సాగేందుకు చక్కటి రహదారులు ఎంతో అవసరం. ఇదే సమయంలో గ్రామాలు, పట్టణాల్లో వాహనాలు వేగంగా వెళ్తుండడంతో పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాంటి ప్రాంతాల్లో వేగ నియంత్రికలు ఉంటే కొంతవరకు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చు. వర్గల్ మండలంలోని గౌరారం మీదుగా రాజీవ్ రహదారి వెళ్తుంది. ఈ మార్గంలో వాహనాలు వేగంగా వెళ్తుంటాయి. దీంతో గ్రామస్థులు రోడ్డు దాటే క్రమంలో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ వేగనియంత్రికలు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వర్గల్, (గౌరారం):

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



పరిసరాలు బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. పారిశుద్ధ్యం సరిగా లేనట్లయితే అనేక సమస్యలు తలెత్తుతాయి. వర్గల్ మండలం గౌరారంలో చాలా ఏళ్ల క్రితం నిర్మించిన మురుగు కాలువలు శిథిలావస్థకు చేరి ఎక్కడికక్కడ కూలిపోతున్నాయి. దీంతో మురుగునీరంతా రోడ్లపై పారుతోంది. రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్నా అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్లు సైతం దెబ్బతిన్నాయని, కోతులు, పందులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి అంతర్గత మురుగు కాలువలను నిర్మించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, వర్గల్, (గౌరారం)

పశుగణనతో ఆర్థికవ్యవస్థ బలోపేతం

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: పశుసంపద ఉత్పత్తి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమే లక్ష్యంగా పశుగణన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వ పాడి పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటుందని గజ్వేల్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ బాబు అన్నారు. బుధవారం గజ్వేల్‌లోని పశువైద్యశాలలో ఆయన మాట్లాడారు. 16 రకాల పెంపుడు జంతువుల వివరాలు సేకరించనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఈనెల 25 నుంచి 4 నెలల పాటు సాగుతుందన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గట్లమల్యాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం మహిపాల్ తదితరులు

నంగునూరు, న్యూస్‌టుడే: రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని ఏపీఎం మహిపాల్ అన్నారు. బుధవారం మండల పరిధి ఖాతా, గట్లమల్యాల, అంక్సాపూర్, తదితర గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో లక్ష్మప్ప, తహసీల్దారు సరితతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు దేవులపల్లి యాదగిరి, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట: సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఛైర్మన్ చింతల శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. వివిధ విభాగాల అధికారులు, నేతలు అమృతసేనారెడ్డి, దుర్గారెడ్డి, రాజు, శ్రీశైలం, అంకుశ్, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

చిన్నకోడూరు, రాయపోల్: చిన్నకోడూరు మండలంలోని మైలారం, ఎల్లాయిపల్లి, రంగాయిపల్లి గ్రామాల్లో, రాయపోల్ మండలంలోని అనాజీపూర్, లింగారెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అధికారులు, తదితరులు ప్రారంభించారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించరూ



మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఐకాస ప్రతినిధులు

చేర్యాల: చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన ఐకాస ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఐకాస ఛైర్మన్ డాక్టర్ ఆర్.పరమేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం చేర్యాలలో ఆయనను కలిసి వినతిప్రతం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐకాస ప్రతినిధులు పుర్మ ఆగంరెడ్డి, ఉమారాణి, అందె అశోక్, అందె బీరన్న, మహదేవుని శ్రీనివాస్, మంచాల చిరంజీవులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను సంరక్షిస్తేనే బతుకుదెరువు



నీటిపారుదల ఏఈకి వినతిపత్రం ఇస్తున్న మత్స్య కారులు

చేర్యాల, న్యూస్‌టుడే: వేచరేణి శివారులోని ఎర్రకుంట, నాగుల కుంటలో కొందరు నిర్మాణాలు చేస్తూ తమ జీవనోపాధి అయిన చేపల పెంపకానికి ఆటంకం కలిగిస్తున్నారని ఆ గ్రామ ముదిరాజ్ సంఘం(మత్స్య కార్మికులు) ఆవేదన వ్యక్తం చేసింది. ఆ రెండు కుంటల్లో చేపట్టిన నిర్మాణాలు తక్షణమే నిలిపివేయాలని కోరుతూ బుధవారం నీటిపారుదల శాఖ ఏఈ, తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు కుంటలు ఆక్రమణకు గురవుతున్నాయని, అన్నింటినీ సర్వే చేసి, పరిరక్షించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చరా?

సిద్దిపేట: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని రాష్ట్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేటలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. రూ.2 లక్షల పంట రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణానికి స్థలం కేటాయించాలని నిరసన

బెజ్జంకి, న్యూస్‌టుడే: మండలంలోని బేగంపేట శివారులో గతంలో రెండు పడక గదుల ఇళ్ల కోసం కేటాయించిన స్థలంలోనే అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పలువురు బాధితులు తెలిపారు. రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ కోసం నిర్మించిన శిలా ఫలకం వద్ద బుధవారం నిరసన చేపట్టారు.

నిర్వాసితులకు తోడుగా నిలవండి

గజ్వేల్: ఒకరినొకరు నిందించుకోకుండా తన సమస్యల పరిష్కారానికి చేయాలని మల్లన్నసాగర్ నిర్వాసితులు తొగుట మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ మల్లేశం, లక్ష్మాపూర్ మాజీ సర్పంచి శ్రీనివాస్, పల్లెపహాడ్ మాజీ ఉపసర్పంచి రమేష్ తదితరులు బుధవారం గజ్వేల్‌లో కోరారు.

క్యాన్సర్‌పై అవగాహన

సిద్దిపేట టౌన్: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లోహిత్‌సాయి ఆస్పత్రి వైద్యురాలు డా.శిరీష విద్యార్థినులతో మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డా.జీవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డా.శ్యామ్, అధ్యాపకులు తదితరులున్నారు.

ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు?

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపక, ఇతర పోస్టులను భర్తీ చేయాలని భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల శంకర్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు.

పొదలు తొలగించి.. వెతలు తీర్చి



జేసీబీతో ముళ్లపొదలను తొలగిస్తూ..

హుస్నాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: హుస్నాబాద్ మండలం పందిల్లకు వెళ్లే బైపాస్ రోడ్డు పక్కన పెరిగిన ముళ్లపొదలను జీ5 టౌన్‌షిప్ సహకారం, మాజీ సర్పంచి తోడేటి రమేశ్ ఆధ్వర్యంలో తొలగించారు. పందిల్ల వంతెన నుంచి గ్రామానికి వెళ్లే ఈ రహదారికి ఇరువైపులా తుమ్మచెట్లు పెరిగాయి. రోడ్డుపైకి కొమ్మలు విస్తరించడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో మాజీ సర్పంచి రమేశ్ జీ5 టౌన్‌షిప్ ప్రతినిధులతో బుధవారం మాట్లాడి జేసీబీ సాయంతో తుమ్మచెట్లను తొలగించారు.

బోధనా రుసుములు విడుదల చేయండి



హుస్నాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

హుస్నాబాద్, న్యూస్‌టుడే: బోధనా రుసుములు, ఉపకార వేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. బుధవారం స్థానిక కరీంనగర్ రోడ్డులో బాలికల జూనియర్ కళాశాల ఎదుట ఆందోళన చేపట్టి నినాదాలు చేశారు. ఫీజులు చెల్లించకపోవడంతో కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ప్రైవేటు కళాశాలల యజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, మండలాధ్యక్షుడు సంతోష్, అనంతస్వామి, చొక్కాచారి, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

దుబ్బాక, మిరుదొడ్డి: ఉపకార వేతనాలు విడుదల చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



గ్రంథాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

మిరుదొడ్డి, న్యూస్‌టుడే: గ్రంథాలయాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ శాఖ ఛైర్మన్ కేడం లింగమూర్తి పేర్కొన్నారు. మిరుదొడ్డి శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు రాత పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రంథ పాలకుల నియామకానికి ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మద్యం తాగి పట్టుబడిన వారికి జరిమానా

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: మద్యం తాగి పట్టుబడిన పలువురు వాహనదారులకు బుధవారం సిద్దిపేట జిల్లా ద్వితీయ శ్రేణి జ్యుడీషియల్ న్యాయమూర్తి కాంతారావు జరిమానా విధించారు. గత కొన్ని రోజుల కిందట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం, నర్సాపూర్, రంగధాంపల్లి చౌరస్తాలు, మెదక్ రోడ్, వేములవాడ కమాన్ వద్ద ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా ఏడుగురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. నిర్ధారణ పరీక్షల అనంతరం నివేదిక ఆధారంగా వారిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారికి మొత్తంగా రూ. 15,500 జరిమానా విధించారు.

దొంగతనం కేసులో నిందితుల రిమాండ్

వర్గల్, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో పట్టుబడిన ముగ్గురు నిందితులను రిమాండుకు తరలించినట్లు గౌరారం ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో సోమవారం గ్రామానికి చెందిన తిమ్మాయిపల్లి మల్లేష్‌గౌడ్ ఇంట్లో దొంగతనం జరిగిన విషయం తెలిసిందే. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించగా.. బుధవారం నాచారంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి 5 గ్రా. బంగారం రికవరీ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన వారిలో చాంద్‌ఖాన్‌మక్త గ్రామానికి చెందిన పోయినమైన సుధాకర్, చౌదర్పల్లికి చెందిన ఎండీ షాబుద్దీన్, ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా, కొండేపి మండలం, నేతివారిపాలెం గ్రామానికి తాపీమేస్త్రి తన్నీరు నారాయణ ఉన్నారు.

చరవాణుల అప్పగింత

గజ్వేల్ గ్రామీణ, న్యూస్‌టుడే: పోగొట్టుకున్న చరవాణులను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు గజ్వేల్ సీఐలు సైదా, ముత్యంరాజులు బుధవారం ఠాణాలో అందించారు. గజ్వేల్ ప్రాంతానికి చెందిన 15 మంది చరవాణులు అపహరణకు గురికావడంతో వారు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు వివరాలు నమోదు చేసి, ఫోన్లను గుర్తించి బాధితులకు అందించారు.